

ఉత్తమ డ్రైవర్లతో సీపీ అంబర్ కిశోర్‌ఝా, ఆర్ఎం విజయ భాను

# ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి

## సీపీ అంబర్ కిశోర్‌ఝా

హనుమకొండ చౌరస్తా, జూలై 30: ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా సూచించారు. ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం హనుమకొండ బస్‌స్టేషన్‌లోని వరంగల్-1 డిపోలో నిర్వహించగా, సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఉద్యోగం చాలా అప్రమత్తతతో ఉండి నిర్వహించాల్సిందని చెప్పారు. ఆర్ఎం డీ విజయభాను మాట్లాడుతూ అత్యధిక సర్వీస్ కలిగి ప్రమాదరహిత డ్రైవర్లుగా అవార్డు అందుకున్న వారిని ఆదర్శంగా తీసుకొని డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అత్యధిక సర్వీస్ కలిగి ఉండి యాక్సిడెంట్ ఫ్రీ రికా ర్డు ఉన్న ముగ్గురిని ప్రతి డిపో నుంచి మొత్తం 30 మందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మాధవరావు, 9 డిపోల డీఎంలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ములుగు దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య ఉద్యోగులు

# నల్ల బ్యాడ్జీలతో వైద్య ఉద్యోగుల నిరసన

ములుగు రూరల్, జూలై 30 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న వైద్య ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మెడికల్ కళాశాలలో తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత కలెక్టర్, మంత్రి ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న వైద్య ఉద్యోగులకు మెడికల్ కళాశాల పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు అప్రూవల్ చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ తమను పక్కన పెట్టి కొత్త వారి పేర్లను ఫైనల్ లిస్టులో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నిరసనలో దవాఖాన వైద్య సిబ్బంది, ఔట్ సోర్సింగ్, శానిటేషన్ ఉద్యోగులు ఎండీ ఫజల్, గాజె రమేశ్, వినోద్‌కుమార్, సదయ్య, స్వామి, రమేశ్, లత, ప్రమీల, జయసుధ, కృష్ణ, విజయ్‌చందర్, అనిల్, రవి, అజిత, శ్రీను, బాలు, వేణునాయక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో టూరిజం బ్యాటరీ వాహనం

కాళేశ్వరం, జూలై 30 : కాళేశ్వరంలోని హరిత హోటల్‌కు టూరిజం బ్యాటరీ వాహనం వచ్చింది. యాత్రికుల సహాయార్థం వాహనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు హోటల్ మేనేజర్ సురేశ్ తెలిపారు. కాగా, మంగళవారం హోటల్ నుంచి గోదావరి, ఆలయం వరకు ట్రయల్ నడిపారు.



టూరిజం బ్యాటరీ వాహనం




















